"నోటితో నన్నేం అనడు సార్ చేతుల్తో నన్ను చాలా వేధిస్తున్నాడు సార్. నన్ను చూస్తూ కన్ను కొడతాడు. కారిడార్స్‌లో నన్ను డాష్ కొట్టుకుంటూ వెళుతుంటాడు" బాధ నటిస్తూ అంది సీత.

"హా... " టేబుల్‌కేసి బాధగా తలకాయ కొట్టుకున్నాడు ఏకాంబరం "ఆ డింబాల డుంబు ఇంతకి తెగించాడా? చూడు వాడిని నేనేం చెస్తానో?" అంటూ టేబుల్ మీది కాలింగ్ బెల్ గణ గణా వాయించాడు కసిగా.

వెంటనే ప్యూన్ లోపలికి పరుగెత్తుకు వచ్చాడు.

"ఉన్న పళంగా కిల్లారికిత్తిగాడిని నా దగ్గరికి పంపించు."

"మనాఫీసులో మీరు తప్ప మిగతా వాళ్ళంతా కిల్లారికిత్తులే సార్ ! ఇంతకీ తమరు చెప్పింది ఏ కిల్లారికిత్తిగాడి గురించి సార్?" వినయంగా అడిగాడు ప్యూన్.

"చిప్ప కట్టే మొహం వేస్కుని ఉంటాడే వాడు!" పళ్ళు నూర్తూ అన్నాడు ఏకాంబరం .

"మనాఫీసులో మీది తప్ప అందరివి చిప్పకట్టె మొహాలే. ఇంతకీ తమరే చిప్పకట్టె మొహం గురించి చెపుతున్నారు సార్?"

" సీత మొహం చిప్ప కట్టె మొహం కాదు" సీతవంక ఆప్యాయంగా చూస్తూ అన్నాడు ఏకాంబరం .

"అవును సార్!" వినయంగా తల్కాయ్ ఊపాడు ప్యూన్.

"నేను చెపుతుంది ఆ మోహన్ గాడి గురించి. వాడిన వెంటనే నా క్యాబిన్‌లోకి పంపించు" అరుస్తున్నట్టుగా అన్నాడు ఏకాంబరం.

అలాగే నంటూ ప్యూన్ బయటకి వెళ్ళాడు.

కొద్ది క్షణాలలో మోహన్ ఏకాంబరం క్యాబిన్‌లోకి వచ్చాడు.

ఆ పనిమీదా, ఈ పనిమీదా పెట్టి మోహన్‌ని సీత ముందు చెడామడా తిట్టేశాడు ఏకాంబరం. మోహన్ జేవురించిన మొహంతో బయటికి వెళ్ళిపోయాడు. సీత కసిగా నవ్వుకుంది.

"ఇంకా ఇప్పుడే ఏమైంది.....వెధవని మారుమూల అడవులలోకి ట్రాన్స్‌ఫర్ చేయిస్తా....." అన్నాడు ఏకాంబరం సీతతో.

"ఎందుకులే సార్... పోనియ్యండి" అంది సీత ఏకాంబరం వంక ప్రేమగా చుస్తూ.

ఆ చూపులకి గిలగిలలాడిపోయాడు.

"అబ్బే...లాభం లేదు. ఇక్కడ వుంటే వాడు నీతో పిచ్చి వేషాలేస్తాడు. వాడిని దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయించాల్సిందే" అన్నాడు.

"మీకు నేనంటే ఎంత అభిమానం సార్...." అంది సీత .

"ఊ...... మరి? సరేగానీ సీతా... మనం ఎప్పుడయినా ఓ రాత్రిపూట, మంచి రెస్టారెంటులో డిన్నర్ చెయ్యాలి!"

"ఓసి ముసలి నక్కా...." మనసులో అనుకుంది సీత .

0 0 0

అది లంచ్ టైమ్. అరగంట నుండి బుచ్చిబాబు సీత కోసం ఎదురు చూసీ చూసీ చాలా అసహనంగా ఫీలయ్యాడు.

"ఇంక సీత రాదు. ఏకాంబరంగాడు సీతని క్యాబిన్‌లోంచి బయటికి వదిలినట్లు లేదు. సిల్లీ నాయాలు!" అనుకుని తన టిఫిన్ బాక్స్ ఓపెన్ చేసి తినేశాడు.

"నీ కోసం అరగంట నుండి ఎదురుచూశా. ఇప్పుడా నువ్వు రావడం? నీ కోసం చూసి చూసి ఇప్పుడే నేను తినేశాను" కాస్త విసుగ్గా మొహం పెట్టి అన్నాడు బుచ్చిబాబు .

"మరేం ఫర్లేదులే...." అంది సీత.

"నీ లంచ్ బాక్స్ ఏదీ?"

"నేను తినేసే వచ్చాను"

"ఎవరితో అ కిల్లారి కిత్తిగాడు ఏకాంబరం గాడితోనా?" పళ్ళు కొరుకుతూ అన్నాడు బుచ్చిబాబు .

"కాదు. నవీన్‌తో! పాపం తను ఒంటరిగా ఉన్నాడనీ, కంపెనీ ఎవరూ లేరని నన్ను చాలా రిక్వెస్ట్ చేశాడు. నేను కాదని అనలేకపోయా"

"ఇక్కడ నేను కూడా వంటరిగా ఉన్నా!" నెత్తి కొట్టుకుంటూ అన్నాడు బుచ్చిబాబు ." అయినా నేనుండగా నువ్వు ఆ వెధవాయ్‌తో లంచ్ చేయటం ఏంటి సిల్లీగా?"

"పాపం అలా అనకు బుచ్చీ! నవీన్ చాలా మంచివాడు" అంది సీత జాలిగా మొహం పెట్టి.

"ఆ!......"

బాధగా జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు .

"ఏం? నవీన్ మంచివాడవడం అంత బాధాకరమయిన విషయమా?" అడిగింది సీత బుచ్చిబాబు వంక వింతగా చూస్తూ.

"ఆ!....."

మరోసారి అరుస్తూ బాధగా జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు .

0 0 0

రాత్రి ఏడు గంటలయింది.

బుచ్చిబాబు కిటికీ లోంచి వీధిలోకి నిముషానికోసారి చూస్తున్నాడు. చూసిన ప్రతీ సారీ సీత ఇంకా రాలేదేంటబ్బా అని అనుకుంటూ ఉన్నాడు.

సాయంత్రం అయిదు గంటలకి సీత బుచ్చిబాబు సీటు దగ్గరికి వచ్చి"బాస్ అప్పుడే వెళ్ళొద్దు. అర్జంటుపని ఉంది ఉండమని చెప్పాడు. నువ్వు ఇంటికెళ్ళిపో...నేను నాపని కాగానే వచ్చేస్తాను" అని చెప్పింది.

కానీ సీత అంతదాకా రాలేదు.

"అసలు ఈ ముసలి వెధవకి అంత క్రేజీనేస్ ఎందుకో సిల్లీగా?" పళ్ళు నూరుకుంటూ అనుకున్నాడు బుచ్చిబాబు .

సరిగ్గా అదే సమయంలో నవీన్ స్కూటర్ ఇంటి ముందు ఆగింది. బుచ్చిబాబు మనసు బాధతో గిలగిల లాడిపోయింది. కేవలం నవీన్ స్కూటర్ ఇంటిముందు ఆగినందుకు కాదు. ఆ స్కూటర్ వెనకాల సీత కూర్చుని ఉంది.

సీత స్కూటర్ దిగి ఒక పదినిమిషాలపాటు నవీన్‌తో నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడి తర్వాత నవీన్‌కి టా టా చెప్పి పంపించింది.

"ఆ......."

బుచ్చిబాబు బాధగా అరుస్తూ జుట్టు పీక్కున్నాడు.

0 0 0

"అయ్యా తమరికోసం ఎవరో వచ్చారండి....." పనివాడు వచ్చి మినిస్టర్ మిన్నారావ్‌తో చెప్పాడు.

"వీల్లేదు. కుదరదంటే...నేనెవర్ని కలవను. నేనింట్లో లేనని సెప్పెయ్....లేదా ఈ లోకంలోనే లేనని సెప్పెయ్...." ఇరిటేట్ అయిపోతూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్ .

"అది కాదండీ బాబూ... ఆరెవరో నీకు సన్మానం సెయ్యడానికో, అదేదో ఓపెనింగ్స్ సెయ్యడానికో వచ్చినట్టున్నారండీ....సేతిలో దండ కూడా ఉన్నాదండీ... మరేనండి!"

ఆ మాట వింటూనే మినిస్టర్ మిన్నారావ్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

"సరేలే...లోపలికి పంపించు" అన్నాడు సోఫాలో వెనక్కి వాలుతూ.

అసలు మినిస్టర్ మిన్నారావ్ ఎవర్ని కలవాలన్నా భయపడుతున్నాడు పాత న్యూస్‌పేపర్ చూపించి ఎవడేం పని చెయ్యమంటాడోనని. పనివాడు పంపించిన వ్యక్తి లోపలికి వచ్చాడు. అతని చేతిలో పెద్ద గులాబీ దండ ఉంది.

మినిస్టర్ మిన్నారావ్ ఆనందంగా లేచి నిలబడ్డాడు.

"ఏటో...మీ అభిమానాన్ని కాదనలేని ఈక్‌నేసే నాది. అ దండిట్టా ఏసెయ్యండి...ఏ

సెయ్యాలి మరి అన్నాడు మెడవంచి మిన్నారావ్.

"ఈ దండ వెయ్యడానికి తీసుకురా లేదండీ...." అన్నాడు వ్యక్తి.

"మరి?"

"ఇది చేతిలోవుంటే తప్ప లోపలికి పంపించరని అలా చెప్పాను. నేనొచ్చింది అసలు వేరేపనిమీద"

"ఏం పని?" అనుమానంగా భయంగా ఆ వ్యక్తి వంక చూస్తూ అడిగాడు మినిస్టర్ మిన్నారావ్ .

"మా యింట్లో లెట్రిన్ చెడ్డకంపు కొట్టేస్తున్నాయ్...క్లీన్ చెయ్యడానికి ఎవరూ రావడం లేదు."

"అయితే నాకేంటి? మా లెట్రిన్‌లు కూడా కంపుకొడుతున్నాయి! ఎల్లు" అరుస్తూ అన్నాడు మిన్నారావు.

ఆ వ్యక్తి కొన్ని క్షణాలు మిన్నారావు కళ్ళలోకి చూశాడు. తర్లువాత జేబులోంచి మడతలు పెట్టిన ఓ న్యూస్‌పేపర్ కటింగ్ తీసి....

"దీన్ని కాస్త చూస్తారా?" అని అన్నాడు.

ఆ పాత న్యూస్ పేపరు కటింగ్ చూడగానే పెద్దగా గావుకేక పెట్టి నేలమీద ఢమాల్ అని పడిపోయాడు మినిస్టర్ మిన్నారావ్ .

0 0 0

రాత్రిపూట........

మంచం మీద బోర్లా పడుకుని కుమిలి ఏడ్చాడు మినిస్టర్ మిన్నారావ్ . కాస్సేపలా ఏడ్చాక అతని మనసు కాస్త తేలికపడింది. మెల్లగా లేచి ఫోన్ దగ్గరికి వెళ్ళి ఓ నెంబర్ డయల్ చేశాడు. అవతల రింగ్ అవడం మిన్నారావుకి వినిపించింది.

కొన్ని క్షణాల తర్వాత అవతలి మనిషి ఫోనెత్తి "ఎవడ్రా నీ యబ్బ?" అన్నాడు.

"నేనే రుస్తుం దాదా! మిన్నారావుని!" అన్నాడు మినిస్టర్ మిన్నారావ్ .

"చెప్పు సాబ్!"

"ఏటి చెప్పేది?... ఆ బుచ్చిబాబు గాడి సంగతేం సేశావ్?... ఆడు నా బతుకుని బురద్లో పందికింద సేసేస్తున్నాడు".

"మీరేమో అడ్వాన్సు ఏదీ కొట్టించకుండా సేసెయ్ సేసెయ్ అంటే ఎక్కడ కుదుర్తాది సాబ్... బిజినెస్ లాసైపోతాది."

"సరే... నువ్వేంటనే ఈడికొచ్చెయ్" అని ఫోన్ పెట్టేశాడు మినిస్టర్ మిన్నారావ్ .

పావు గంటలో రుస్తుం దాదా మినిస్టర్ మిన్నారావ్ ముందు నిలబడ్డాడు.

"ఇదిగో... ఈ యాభై వేలు తీసుకో...." అంటూ నోట్లకట్టని రుస్తుం దాదా ముందుకు విసిరాడు మిన్నారావు.

“ఆడు బతకడానికి ఈల్లేదు” అన్నాడు.

రుస్తుందాదా నోట్లకట్టని జేబులో కుక్కుకుంటూ అన్నాడు.

“ఒక ట్రెండు రోజుల్లో నేను విజయవాడ వెళ్తా... ఆడిని లేపేసేకే మళ్ళీ ఎనక్కొస్తా...”

0 0 0

డోర్ బెల్ మోగింది.

ఇంత పొద్దున్నే ఎవడొచ్చాడబ్బా అనుకుంటూ న్యూస్‌పేపర్ పక్కన పడేసి సోఫాలోంచి లేచివెళ్ళాడు బుచ్చిబాబు.

తలుపు తీస్తే ఎదురుగా ఒక అపరిచిత వ్యక్తి ఉన్నాడు. అతనికి నలభై అయిదు యాభై సంవత్సరాల మధ్య వయసు ఉంటుంది. బట్టతల లావుగా, నల్లగా పొట్టిగా ఉన్నాడు

“ఎవరు మీరు?” ఆడిగాడు బుచ్చిబాబు .

“నేనేవరయితే ఏంలే...మీకు మా పేర్లతోనూ అడ్రసుల్తోనూ అవసరం లేదుగా...మీ బిజినెస్ మూడు పగళ్ళూ ఆరు రాత్రులుగా సాగడం మీకు ముఖ్యం!” అన్నాడా వ్యక్తి గారపళ్ళు బయట పెట్టి నవ్వుతూ.

“బిజినెస్సా?....అదేంటి?......” బుర్రగోక్కున్నాడు బుచ్చిబాబు “యాక్టింగ్ చెయ్యకండి సార్ ..... నేను నమ్మకమయిన కస్టమర్నే మీ బిజినెస్ గురించి అళ్లకీ ఈళ్ళకీ చెప్పను....సీక్రెట్‌గానే ఉంచుతాను. ఈ రాత్రికి బుకింగ్ ఖాళీగానే ఉందా?”

“కస్టమరేంటీ, సీక్రెట్ ఏంటీ, బుకింగ్ ఏంటీ?.....నాకొక్కముక్క కూడా అర్థంకావడం లేదు” అయోమయంగా అన్నాడు బుచ్చిబాబు .

“నాకు తెలుసు సార్...ఒట్టిగా మాట్లాడితే నీకు అర్థంకాదు...... డబ్బులు సూస్తే మొత్తం అర్థమవుతుంది....” గారపళ్ళు మరోసారి బయట పెట్టి జేబులోంచి పర్సుతీసి రెండు వందనోట్లు బయటికి తీశాడు అతను.

“తీస్కోండి” ఆన్నాడు.

“ఎందుకు” అడిగాడు బుచ్చిబాబు .

“నా నోటితో చెపితేగానీ మీకు తృప్తిగా వుండదేమో.... మీరు మీతోబాటు ఇక్కడ ఒక అమ్మాయిని పెట్టి బిజినెస్ చేస్తున్నారుగా.. ఆ అమ్మాయిని రాత్రికి నేను బుక్ చేసుకుందామని.......”

అతని మాటలు పూర్తి అయ్యేకాకముందే బుచ్చిబాబు అతని పీక పట్టుకున్నాడు.

“ఎవడ్రా నీకు అలా అని చెప్పిందీ....”

బుచ్చిబాబు అతని మెడవంచి వీపుమీద గట్టిగా ఓ గుద్దుగుద్దాడు.

"చూడు నిన్నేంచేస్తానో ..."అంటూ అతని చెయ్యి మెలిపెట్టాడు.

అతను బాధగా ఓ అరుపు అరిచి తర్వాత బలంగా విదిలించిచెయ్యి విడిపించుకున్నాడు.

"బాగానే ఉందయ్యా?.... ఇందులో నా తప్పేం ఉంది?....ఎవరో అనుకుంటుంటే నిజమేనేమో అనుకుని వచ్చాను కాకపోతే కాదని చెప్పాలి గాని ఇలా చెయ్యిచేసుకుంటావా?" అనేసి రుసరుసలాడుస్తూ అక్కడినుండి వెళ్ళిపోయాడు అతను.

హాల్లో నడుంమీద రెండుచేతులూ పెట్టుకుని సీరియస్‌గా చూస్తూ సీత నిల్చుని ఉంది.

ఆమె మొహం చూస్తూనే బుచ్చిబాబుకి అర్థం అయ్యింది. వాడికీ అతనికి జరిగిన సంభాషణ మొత్తం సీత విన్నదని.

"నీకు ఇలాకావలసిందే! అంతా నాఖర్మ!" నెత్తి కొట్టుకుంది సీత .

0 0 0

ఆఫీసుకు బుచ్చిబాబు, సీత ఇద్దరూ తయారయ్యారు.

"పద...!" అంది సీత బుచ్చిబాబుతో హ్యాండ్ బ్యాగ్ చేతికి తగిలించుకుంటూ.

"నాకు టిఫిన్ బాక్స్ సర్ది ఇచ్చావు....మరి నువ్వు బాక్స్ తెచ్చుకోవడం లేదే?" అడిగాడు బుచ్చిబాబు .

"నేనివాళ లంచ్ టైంలో నీ దగ్గరికి రావడం లేదు!" చెప్పింది సీత.

"ఏం?....... లంచ్ చెయ్యవా?"

"చేస్తాను...... ఏకాంబరం బయటికెళ్లి ఏదైనా మంచి రెస్టారెంట్‌లో లంచ్ చేద్దాం అన్నాడు"

"నువ్వేమన్నావ్?" అనుమానంగా భయంగా చూస్తూ అడిగాడు.

"సరేనన్నా!...."

బుచ్చిబాబు బాధగా జుట్టు పీక్కుంటూ జాతీయతా భావంతో ఇలా అన్నాడు.

"హే రామ్!.....హయ్‌ల్లా!!......ఓ జీసస్!!! "

* * *